# వేలిముద్రలతో వేట

## పాపిలాన్‌తో పట్టేస్తారు!

- 2017 మే నుంచి 1,114 మంది నిందితుల గుర్తింపు
- రూ.27.74 కోట్ల చోరీ సొత్తు రికవరీ
- ఇతర రాష్ట్రాలకు చెందిన 30 కేసుల ఛేదన

**నేరస్థులు ఎవరైనా వేలిముద్ర (చాన్స్ ప్రింట్)తో పట్టేస్తున్నారు తెలంగాణ ఫింగర్‌ప్రింట్ పోలీసులు. అత్యాధునిక పాపిలాన్ సాంకేతికతతో నేరస్థులను నీడలా వెంటాడుతున్నారు. నేరం జరిగిన వెంటనే పట్టుకుని కటకటాల్లోకి పంపిస్తున్నారు. ఇతర రాష్ట్రాల కేసుల ఛేదనలోనూ సాయం అందిస్తున్నారు.**




హైదరాబాద్, జనవరి 10(నమస్తే తెలంగాణ): నేరస్థులను పట్టుకోవడంలో రాష్ట్ర పోలీసులు తమదైన ముద్ర వేస్తున్నారు. నేర పరిశోధనలో దేశంలోనే తొలిసారిగా సాంకేతికత పాపిలాన్‌ను జోడించారు. అద్భుత ఫలితాలు సాధిస్తున్నారు. సీఐడీలోని తెలంగాణ ఫింగర్‌ప్రింట్ బ్యూరో ఆధ్వర్యంలో తీసుకొచ్చిన మొబైల్ సెక్యూరిటీ చెక్ డివైజ్‌లు, లైవ్ స్కానర్లు, ఇంటర్‌స్టేట్ డాటా షేరింగ్.. ఇలా చేపట్టిన ఎన్నో సంస్కరణలు సత్ఫలితాలిస్తున్నాయి.

- మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలం బోయిన్‌పల్లిలో ఇటీవల పెండ్లింట 61 తులాల బంగారం, రూ.2.80 లక్షల సొమ్ము చోరీ సంచలనం సృష్టించింది. నిందితుడు వదిలిన ఏకైక ఆధారం వేలి ముద్ర (చాన్స్ ప్రింట్). దాని ఆధారంగా నిందితుడు రాజేంద్రప్రసాద్ జాడను పోలీసులు కనిపెట్టారు.
- రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వరుస చోరీల్లో రూ.12.45 లక్షల సొత్తు ఎత్తుకెళ్లిన పాండును వేలిముద్రల ఆధారంగానే పోలీసులు అరెస్టుచేశారు.
- జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన షేక్ ఉస్మాన్ మంచిర్యాలలో చోరీ సొత్తు అమ్మేందుకు తిరుగుతుండగా మొబైల్ ఫింగర్‌ప్రింట్ డివైజ్ ద్వారా పరిశీలించి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

### పాపిలాన్ అంటే..

పాపిలాన్ అనేది ఒక సాఫ్ట్‌వేర్. ఫింగర్ ప్రింట్ పరిశోధనకు సంబంధించి దీన్ని వాడుతున్నారు. ఈ టెక్నాలజీ సాయంతో పాత నేరస్థుల వేలిముద్రలతో డాటా తయారుచేస్తారు. నేరస్థలిలో లభించే వేలిముద్రలను ఈ టెక్నాలజీని ఉపయోగించిన డాటాబేస్‌లోని పాత నేరస్థుల ఫింగర్‌ప్రింట్స్‌తో పోల్చి క్షణాల్లోనే నిందితులను గుర్తిస్తున్నారు. తక్కువ సమయంలోనే నేరస్థులను అరెస్టుచేసే అవకాశం కలుగుతున్నది. అంతర్జాతీయస్థాయి దర్యాప్తు సంస్థలు సైతం ఈ టెక్నాలజీని వాడుతున్నాయి. దేశంలో తెలంగాణలోనే దీని వినియోగం మొదలైంది.

## రాష్ట్ర ఫింగర్ ప్రింట్ బ్యూరో విజయాలు

**659** — 2017 మేలో పాపిలాన్ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చినప్పటినుంచి 2020 డిసెంబర్ 31 వరకు ఛేదించిన (గతంలో అపరిష్కృతంగా ఉన్న) పాత కేసులు

**1,114** — డాటాబేస్‌లోని సమాచారం ఆధారంగా గుర్తించిన నిందితులు

**రూ. 27.74 కోట్లు** — వేలిముద్రల ఆధారంగా ఛేదించిన చోరీ కేసుల్లో రికవరీ

**30** — పాపిలాన్ టెక్నాలజీతో ఛేదించిన ఇతర రాష్ట్రాల్లోని కేసులు

**113** — రాష్ట్రవ్యాప్తంగా గుర్తించిన అనాథ శవాల జాడ

**13,555** — రాత్రిళ్లు అనుమానాస్పదంగా తిరుగుతూ మొబైల్ సెక్యూరిటీ చెక్ డివైజ్‌ల ద్వారా పట్టుబడ్డ పాత నేరస్థులు.

**118** — నేరచరిత్రను దాచి పాస్‌పోర్టు పొందేందుకు ప్రయత్నించి ప్రత్యేక డివైజ్‌ల ద్వారా పట్టుబడ్డవారు.

**64** — 2020 జనవరి నుంచి ఇప్పటివరకు నాన్‌బెయిలబుల్ వారెంట్లు ఉన్నట్టు గుర్తించిన నేరస్థుల సంఖ్య.

**తెలంగాణలో అరెస్టయిన నిందితుల వేలిముద్రల ఆధారంగా ఏపీలోనూ తొమ్మిది కేసులు పరిష్కారం.**

### సాంకేతికతతో మంచి ఫలితాలు



అత్యాధునిక పాపిలాన్ టెక్నాలజీ వినియోగంతో రాష్ట్రంలో చాలా కేసులు త్వరితగతిన ఛేదించగల్గుతున్నాం. క్షేత్రస్థాయి సిబ్బందికి ఇచ్చిన మొబైల్ చెక్ డివైజ్‌లతో అనుమానితులను రియల్‌టైంలో గుర్తించగల్గుతున్నాం. నేరాల కట్టడికి వీలు కలుగుతున్నది. చాలావరకు అంతర్రాష్ట్ర దొంగల ముఠాలకు చెక్ పెట్టగల్గుతున్నాం. సాంకేతిక విధానంలో డాటాను నిక్షిప్తం చేస్తుండటంతో అది భవిష్యత్తులోనూ ఉపయోగపడుతుంది.

- ప్రభాకర్‌రావు, ఇంచార్జి డైరెక్టర్, తెలంగాణ ఫింగర్‌ప్రింట్ బ్యూరో